క్లుప్తంగా

దుప్పట్ల పంపిణీ



రఘునాథపల్లి : లయన్స్ క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి వ్యవస్థాపక అధ్యక్షుడు మర్కాల యాదిరెడ్డి ఆధ్వర్యంలో మినుముల యాదవరెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆదివారం వారి కుటుంబ సభ్యులు 101 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాత మినుముల మనోజ్‌కుమార్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కందుల అనిల్‌కుమార్, సభ్యులు శ్రీకాంత్, కోళ్ల రాజుగౌడ్, శంకర్‌రెడ్డి, రవికుమార్, త్రిసారెడ్డి, శైలజా యాదిరెడ్డి, కృష్ణకుమార్, రహీం, పాషా, కర్ణాకర్, శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

'సృష్టికి ఆధారం భగవద్గీత'

లింగాలఘణపురం : మండలంలోని గుమ్మడవెల్లిలో ఆదివారం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతను ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సృష్టికి ఆధారం భగవద్గీత అని, ఈ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని సేవా సమితి సభ్యులు గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి జ్ఞానవేదిక భువనగిరి, జనగామ, చేర్యాల, తొర్రూరు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'108'లో ప్రసవం

జఫర్‌గఢ్ : మండలంలోని తీగారం గ్రామానికి చెందిన గర్భిణి ఎండీ హసీనా 108 వాహనంలో శనివారం రాత్రి ప్రసవించింది. హసీనా మూడో కాన్పు కోసం ఆస్పత్రికి వెళ్లేందుకు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే అంబులెన్స్ గ్రామానికి చేరుకోని ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికం కావడంతో పాటు శిశువు మెడకు పేగుతో ఉండడం వల్ల ఎంతో శ్రమించి ప్రసవం చేసినట్లు 108 సిబ్బంది ఈఎంటీ రాజేంద్రప్రసాద్, పైలట్ శ్రీనివాస్ తెలిపారు. కాగా తల్లిబిడ్డను అదే వాహనంలో జఫర్‌గఢ్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

రమేశ్ సేవలు మరువలేనివి



చిల్పూరు : గ్రామంలోని పేదల కోసం బత్తిని రమేశ్ చేసిన సేవలు మరువ లేనివని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోలేపల్లి రంజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామంలో ఇండియన్ బ్యాంకు క్యాషియర్ రమేశ్ మొదటి వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. నాయకులు పసుల వెంకటేష్, మల్లేషం, బోగి రాజయ్య, బత్తిని ఎల్లయ్య, సుభాష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న కోడూర్ మాజీ సర్పంచ్ మృతి



చంద్రయ్య (ఫైల్)

రఘునాథపల్లి : కోడూర్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దుబ్బాక చంద్రయ్య (55) అనారోగ్యంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అభివృద్ధికి కృషి చేసిన చంద్రయ్య మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీశ్ చందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, మాసంపల్లి లింగాజీ, తోటకూరి రమేష్, లోనె శ్రవణ్, సురేష్ తదితరులు చంద్రయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నేడు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

బచ్చన్నపేట : తెలంగాణ రాష్ట్ర ప్రదాత, ఏఐసీసీ సభ్యురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను నేడు (సోమవారం) నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ..జనగామ రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేసి సంబురాలను జరుపుకోవడం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పలువురు హాజరుకావాలని తెలిపారు.

దివ్యాంగుల దినోత్సవం

పాలకుర్తి : ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు శివరాత్రి వెంకటేశ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. దివ్యాంగులకు ఉపాధి కల్పించే సదుపాయాలను ప్రభుత్వాలు కల్పించాలని అన్నారు. యాదగిరి స్వామి, చిట్యాల సంధ్యారాణి, ఉప్పలయ్య, వనం సోమేశ్వర్, బీరెల్లి నర్సయ్య, చెన్నూరు యాకయ్య, శోభ తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా ఇటుక బట్టీలు

అనుమతులు లేవు.. చట్టాలు వర్తించవు

- యథేచ్ఛగా మట్టి తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి గండి..
- పట్టించుకోని అధికారులు, పాలకులు



నర్మెటలో కాలుతున్న ఇటుక బట్టి



బట్టి కాల్చడానికి సిద్ధంగా ఉన్న కలప



నిల్వచేసిన చెరువు మట్టి

నర్మెట : రైతుల పంటపొలాల్లో భూసారాన్ని పెంచే చెరువు కుంటల మట్టి అక్రమ ఇటుక బట్టీ దారులకు ఆదాయ వనరుగా మారింది. ఎలాంటి అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా మట్టిని తరలించినా, కర్రతో బట్టీలు కాల్చినా ఇటు రెవెన్యూ, అటు నీటి పారుదల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వాల్టా చట్టాన్ని ఉల్లంఘించినా అటవీశాఖ అధికారులు సైతం చూసి చూడనట్లుగా ఉంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తయారీదారులకు వాల్టా చట్టం వర్తించదు.. అనుమతులు అంతకన్నాలేవు.. ఒక్క మండల కేంద్రంలోనే ఆరు ఇటుక బట్టీలు వెలిశాయంటే పరిస్థితి ఎలా వుందో అర్థం చేసుకోవచ్చు. సారవంతమైన నలుపు, ఎరుపు మట్టితోపాటుగా బూడిద మిశ్రమాన్ని ఇటుకల తయారీకి వినియోగిస్తున్నారు. అలాగే ఉనుక, కర్రతో బట్టీలను కాలుస్తుండటంతో గ్రామాల్లో సైతం కాలుష్యం పెరిగిపోతోంది. ఓ వైపు ప్రభుత్వ జూనియర్ కళాశాల, మరో వైపు మోడల్ స్కూల్ వీటి పక్కనే సుమారు 15 ఎకరాల స్థలంలో మూడు ఇటుక బట్టీలు ఏర్పాటు చేసిన తయారీదారులు వందల ట్రాక్టర్ల మట్టిని తయారీకి నిల్వ చేశారు. బట్టీలు కాల్చిన సమయంలో వెలువడే పొగతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పవని పలువురు హెచ్చరిస్తున్నారు. వ్యవసాయ భూములను వాణిజ్యపరంగా వాడుకుంటే రెవెన్యూ అధికారుల నుంచి నాలా పర్మిషన్ కావాలి, బట్టీలను కాల్చేందుకు కర్రను వినియోగిస్తే వాల్టా చట్టం వర్తిస్తుంది..అటవీ శాఖ అధికారుల అనుమతులు తప్పని సరి..ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ సాగుతున్న ఇటుక దందాకు అధికారులే సమాధానం చెప్పాలని ప్రజలు కోరుతున్నారు

అనుమతి తప్పనిసరి



ఇటుక బట్టీ విషయం నా దృష్టికి రాలేదు.. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

కే.వీ. రామానుజాచార్యులు, తహసీల్దార్

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం

- వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నెబోయిన భిక్షపతి



నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

జఫర్‌గఢ్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి చిత్తశుద్ధితో పాటుపడుతున్నట్లు ఆ పార్టీ సీనియర్ నాయకుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నెబోయిన భిక్షపతి పేర్కొన్నారు. పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి మండల కేంద్రం నుంచి నాయకులు, కార్యకర్తలు పలు వాహనాల్లో మడికొండకు ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజా సంక్షేమానికి అనేక కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యంగా రుణమాఫీ, మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు సర్వీసు, ఉచిత విద్యుత్ వంటి ఎన్నో కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఒకవైపు సంక్షేమ కార్యక్రమాలు..మరో వైపు గ్రామాల అభివృద్ధికి పాటుపడుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కుల్లా మోహన్‌రావు, మొగిళిపాక నర్సింగం, జ్యోతి యాకయ్య, ఇల్లందుల మొగిళి, మార్కెట్ డైరక్టర్ ఆయేషా బేగం, నాయకులు తాటికాయల ఎల్లయ్య, కుల్లా రాజు, మామిడాల మధు, తోట శంకర్, కృష్ణ, తాటికాయల యాకయ్య తదితరులు ఉన్నారు.

ప్రజా పోరాటాలకు దిక్సూచి సీపీఎం

- జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

స్టేషన్ ఘన్‌పూర్ : ప్రజా పోరాటాలకు దిక్సూచి సీపీఎం అని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు అన్నారు. ఆదివారం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని మండల కేంద్రంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తున్న పార్టీ సీపీఎం అని చెప్పారు. ఈనెల 27,28వ తేదీల్లో స్టేషన్ ఘన్‌పూర్ లో పార్టీ జిల్లా మూడో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 27న భారీ బహిరంగ సభ వేలాది మందితో ర్యాలీ జరుగుతుందని ఈసభను విజయవంతం చేసేందుకు స్టేషన్ ఘన్‌పూర్ పట్టణంలో ఈనెల 18,19,20 తేదీల్లో ఇంటింటికి సీపీఎం మెగా క్యాంపియన్ చేపట్టనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మునిగెల రమేశ్, కోడెపాక యాకయ్య, చిలుముల్ల భాస్కర్, కుర్ర ఉప్పలయ్య, ఐలయ్య, నరసింహులు, మహేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ ఫొటోపై అసెంబ్లీలో మాట్లాడాలి'

జనగామ రూరల్ : దేశ కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించేందుకు అసెంబ్లీలో మాట్లాడాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరుశురామ్ ఆదివారం హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1921లో ఇంపీరియల్ బ్యాంకు కుప్పకూలినప్పుడు 'రూపాయి దాని సమస్య పరిష్కార మార్గం' 'ఇండియన్ బ్యాంకింగ్' చరిత్ర పుస్తకాన్ని రాసి హిల్టాన్ యంగ్ కమిషన్, రాయల్ కమిషన్, సైమన్ కమిషన్‌కు ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఇది వాస్తవమని గ్రహించి 1935, ఏప్రిల్ 1న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పడిందంటే అంబేడ్కర్ వల్లనే అని అన్నారు. ఆర్బీఐ ఏర్పడి 90ఏళ్లు అయిన కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించకపోవడం చరిత్రను వక్రీకరించడమేనని అన్నారు. డిసెంబర్ 9 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయంపై మాట్లాడాలని కోరగా ఇది న్యాయమైన డిమాండ్ అసెంబ్లీలో మాట్లాడుతానని మల్లన్న హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సాధన సమితి నాయకులు బి.రవి, బి.మధు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

'కడియంతోనే అభివృద్ధి'



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

చిల్పూరు : నియోజకవర్గం అభివృద్ధి కేవలం ఎమ్మెల్యే కడియం శ్రీహరితోనే సాధ్యమని ఆ పార్టీ మండల నాయకుడు, చిల్పూరు ఆలయ ధర్మకర్త గనగోని రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్లలో నియోజకవర్గం అభివృద్ధి గురించి పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలోనే ఎంతో అభివృద్ధి చెందుతోందని అన్నారు. కొత్త మండలంగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో చిల్పూరు ఏర్పడినా ఏమాత్రం అభివృద్ధి చేయని నాయకులు ఆరోపణలు చేయడం అర్థరహితమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తౌటి సునీల్, కోల రమేష్, కాండూరి రంగరాజు, మోడెం విజయభాస్కర్, పొన్నం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి రాని 'సీటీ స్కానింగ్'

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

జనగామ రూరల్ : పాలకుల నిర్లక్ష్యం..అధికారుల పట్టింపు లేనితనంతో ఏళ్లు గడుస్తున్న సీటీ స్కానింగ్ అందుబాటులోకి లేకపోవడం దారుణమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధం సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు ఐదుగురు కలెక్టర్లు మారిన, మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పుకుంటున్న జనగామ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో సీటీ స్కాన్ సౌకర్యం లేకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం చేయకుండా పాలకులు, జిల్లా అధికారులు స్పందించి సీటీ స్కాన్ సౌకర్యాన్ని తక్షణమే అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి సందెన రవీందర్, గువ్వల రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల మహేష్, అంతగల్ల మధు మాదిగ, తుర్కపల్లి, గండి సురేష్, నల్ల ఉపేందర్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

దండోరా ఉద్యమ కేంద్రాలుగా మారాలి

- ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సురేశ్

లింగాలఘణపురం : ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అమలుకు గ్రామాలు దండోరా ఉద్యమ కేంద్రాలుగా మారాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గండి సురేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని నెల్లుట్లలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా నల్ల నాగరాజు, ఉపాధ్యక్షుడిగా మిడతపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా రాజన్‌బాబు, కార్యదర్శులుగా రాజు, కృష్ణ, సయుక్త కార్యదర్శిగా నవీన్, ప్రచార కార్యదర్శిగా నల్ల నవీన్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సందెన రవీందర్, నల్ల లాజర్, మైసయ్య, భాస్కర్, స్వామి, యాదయ్య, ఎల్లయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మిత్రులు



జనగామ: సామగ్రి అందజేస్తున్న పూర్వ విద్యార్థులు



రఘునాథపల్లి: సాయం అందజేస్తున్న స్నేహితులు

జనగామ : ముస్త్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న (1987 బ్యాచ్) పూర్వ విద్యార్థులు తమ మిత్రుడు నర్సింహాచారికి అండగా ఉంటూ మానవత్వం చాటుకున్నారు. నరసింహాచారి ఆర్థిక ఇబ్బందులు పడుతూ..తన తల్లితో పాటు మరో వృద్ధురాలిని అక్కున చేర్చుకొని ఉన్నంతలో కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాడు. రోజువారి సంపాదనలో కుటుంబంతో పాటు వృద్ధులను పోషిస్తున్న స్నేహితుడికి మేము సైతం అంటూ కొండంతా అండగా నిలిచారు. జీవిత కాలం నెలకు రూ.2వేల కిరణా సామగ్రి ఇస్తామని హామీ ఇచ్చారు. నరహరి, పున్నంచందర్, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత

రఘునాథపల్లి : మండలంలోని కోమల్ల గ్రామానికి చెందిన ఎలిమినేటి రవీందర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా 1994–95 బ్యాచ్‌కు చెందిన చిన్ననాటి స్నేహితులు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం వారు జమ చేసిన రూ.15 వేల నగదు, 50 కేజీల బియ్యం అందించి ఔదార్యం చాటారు. కార్యక్రమంలో మంకెన అన్నపురెడ్డి, భద్రయ్య, టి.వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

బీటీ రోడ్డుకు మరమ్మతు



దేవరుప్పుల: మండలంలోని పంచాయతీరాజ్ శాఖ పరిధి అంతర్గత రోడ్ల మరమ్మతులు పనులు కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలోని పడమటితాళ్ల నుంచి కడవెండి వరకు బీటీ రోడ్డు ఇరువైపులా ముళ్ల పొదలు అల్లుకొని వాహనదారులు వెళ్లని పరిస్థితి. గత రెండు రోజులుగా రోడ్డుకు ఇరువైపుల ముళ్ల పొదలు, చెట్లు తొలగించడంతో వాహనదారులు, రైతులకు సౌలభ్యం మారిందంటున్నారు. కాగా రోడ్డుకు ఇరువైపులా మట్టి పోసి ఎదురెదురు వాహనాలు వస్తే ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నర్మెట : మచ్చుపహాడ్ ఉన్నత పాఠశాలలో 2004–05లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రెండు దశాబ్దాల అనంతరం మిత్రులు తమ బాల్యంలోని తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటు ఆనందాన్ని పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలు, పూలమాలలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు నేమ్ బోర్డును అందజేశారు. ఈ సమ్మేళన కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోట రాజు, సమ్మయ్య, శాగ కై లాసం, దేవులపల్లి గోపాల కృష్ణ, శ్రీహరి, విద్యాసాగర్, పద్మజ, నిర్వాహకులు రామకృష్ణారెడ్డి, గుండేటి రామచందర్, చింతకింది ప్రభాకర్, గొల్లపల్లి రాజు, కొంపెల్లి అంబేడ్కర్, రాయారపు కనకరాజు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వెలగని విద్యుత్ దీపాలు



జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తాలో విద్యుత్ దీపాలు వెలుగక అంధకారం అలుముకుంది. సెంట్రల్ లైటింగ్‌తో పాటు వీధి దీపాలు వెలగక పోవడంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బంది తప్పలేదు. కేవలం వాహనాల వెలుతురు ఆధారంగానే పోలీసులు ట్రాఫిక్ సేవలు నిర్వహిస్తున్నారు.కాగా మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణ లేకపోవడంతో పురపాలిక పాలన గాడితప్పుతోందని వినబడుతోంది. ఆర్అండ్‌బీ, ఆర్టీసీ చౌరస్తా, ఫ్లైఓవర్ తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు సైతం ఎప్పుడు వెలుగుతాయో..వెలగయో అర్థం కాని పరిస్థితి. - జనగామ

మండల కమిటీ ఎన్నిక



తాళ్లపల్లి రాజేశ్వర్‌గౌడ్

తరిగొప్పుల : గౌడ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (గోపా) మండల నూతన కమిటీ అధ్యక్షుడిగా తాళ్లపల్లి రాజేశ్వర్‌గౌడ్ ఆదివారం ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా జొన్నగోని కిష్టయ్య, వంగ రామరాజు, ప్రధాన కార్యదర్శిగా నాగపూరి కిషన్, కార్యదర్శులుగా పొగాకుల రవి, మూల మహేష్, తీగల బయ్యన్న, నాగపూరి వీరస్వామి, కోశాధికారిగా పలుచాని సుధాకర్, సలహాదారులుగా పలుచాని రమేశ్, బొమ్మెన శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

ఆలయ చైర్మన్‌కు సన్మానం



చిల్పూరు : పల్లగుట్టకు చెందిన పొట్లపల్లి శ్రీధర్ రావు ఇటీవల చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం మడికొండలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ప్రజా విజయోత్సవ సభలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేకంగా సన్మానించారు. నాయకులు గడ్డమీది సురేష్, చిర్ర నాగరాజు, బాసెట్టి మరిప్రసాద్, బొమ్మిశెట్టి బాలరాజు, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, గనగోని రమేష్, బొట్టు చేరాలు, తాళ్లపల్లి సమ్మయ్య, రత్నకర్‌రెడ్డి, అశోక్‌పాల్ ఉన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న అయ్యప్ప మాలధారులు

జనగామ : పట్టణంలోని వీవర్స్ కాలనీ హనుమాన్ దేవాలయంలో లయన్స్ క్లబ్ మిలీనియం అధ్యక్షుగు గాదె నర్సింహులు ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. హైదరాబాద్ ఆయుష్మాన్ భారత్ రక్తనిధి కో ఆర్డినేటర్ రత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో 25 మంది అయ్యప్ప మాలధారులు రక్తదానం చేశారు. అలాగే 80 మందికి షుగర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. రీజనల్ చైర్మన్ చందుపట్ల రవీందర్రెడ్డి, పూర్వ రీజనల్ చైర్మన్ ఏనుగు నర్సిరెడ్డి, శ్రీరామ్ శ్రీనివాస్, జోన్ చైర్మన్ రంగరాజు ప్రవీణ్ కుమార్, కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి బండ భిక్షపతి, పూర్వ అధ్యక్షులు నర్సిరెడ్డి, వెంకటేశ్వర్లు, కాముని శ్రీనివాస్, కోడెం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పారుతున్న మురుగు



చిల్పూరు : మండలంలోని పల్లగుట్ట రహదారి సమీపంలో డ్రైయినేజీలు లేక మురుగు నీరంతా రోడ్డుపై పారుతోంది. వచ్చి పోయే వాహనదారులతో పాటు చుట్టు పక్కల ప్రజలు ఇబ్బంది పడుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని సీపీఎం నాయకుడు సాదం రమేశ్ ఆరోపించారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



పరామర్శిస్తున్న దయాకర్‌రావు

బచ్చన్నపేట : బండనాగారం గ్రామానికి చెందిన ఇజ్జగిరి నర్సయ్య (65) ఆదివారం మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులను పలువురు నాయకులు ఆదివారం పరామర్శించారు. శివరాత్రి కవితరాజనర్సు, కొప్పురపు శ్రీలతశ్రీనివాస్‌రెడ్డి, చల్ల సుధాకర్‌రెడ్డి, నాయకులు నర్సిరెడ్డి, రాములు, జనార్దన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

లక్ష్మీనారాయణపురంలో..

పాలకుర్తి : మండలంలోని లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన మద్దికుంట్ల వెంకటేశ్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందాడు. కాగా ఆదివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పసునూరి నవీన్, మాచర్ల ఎల్లయ్య, పాము శ్రీనివాస్, లకావత్ మహేందర్, సురేష్, నాగరావు, మహేందర్ రెడ్డి ఉన్నారు.

విహార యాత్రలతో విజ్ఞానం



బచ్చన్నపేట : విహార యాత్రలు విజ్ఞానానికి దోహద పడతాయని మండలంలోని దబ్బగుంటపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అమీర్ తెలిపారు. ఆదివారం ఆదిరెడ్డి మెమోరియల్ అకాడమీ చైర్మన్ కల్నల్ నరేందర్‌రెడ్డి సహకారంతో విద్యార్థులను విహార యాత్రలకు తీసుకెళ్లామని అన్నారు.రామప్ప, లక్నవరం, వేయి స్తంభాల గుడి, భద్రకాళి ఆలయం లాంటి ప్రదేశాలను చూపించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొట్టె కనుకయ్య, దీక్షిత, శ్రీవిద్య, మమత విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

జనగామ : 9951602871

Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

కె. మల్లేశ్ (S.R) : 9849921793 (జనగామ)
ఎన్. అనిల్ (S.R) : 9949363827 (పాలకుర్తి)
ఎల్. అనిల్ (S.R) : 8074977328 (స్టే॥ ఘన్‌పూర్)